కప్పబడిపోతుంటయ్. సాహిత్య వీధిలో రచయితకున్న స్థానాన్నిబట్టి కూడ ఇటువంటి విషయాలను "అడ్మిట్" చేస్తారు. విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన "మాకాదుర్గంలో కుక్క" అనే కథ దీనికి తార్కాణం. కథ అంతా అసభ్యంగా ఉన్నా ఏ ఇబ్బందీ ఉండదు. అదే గనుక ఏ సామాన్యుడి కలం నుండో గనుక జారితే, అది అసభ్యంగానూ, అశ్లీలంగానూ, అవినీతిగానూ పరిగణించబడుతుంది. రచయితను కూడ అవినీతి ప్రచారకుడని, సంఘానికి చీడపురుగనీ దుమ్మెత్తిపోస్తారు.

"తొంగిచూచుచు నుండవత్తో
ద్యతులు కుతుకముగన్."

అన్నారు శివశంకర శాస్త్రిగారు "రత్నాకరం" అనే పద్యనాటికలో. వీటినన్నిటినీ ఆపటం కష్టం, అదంచటం అంతకంటె మరీ కష్టం.

ద్వంద్వార్థం వచ్చేటట్లు వ్రాసికూడ తప్పించుకొంటారు విజ్ఞానులు కొందరు. పైన ఉదహరించిన కథలో "రెండు కుక్కలూ కలసికొన్నవి" అని అంటారు విశ్వనాథ సత్యనారాయణగారు. మేధావులు గాబట్టి ద్వంద్వార్థంతో ప్రయోగించేశారు. చలంలాటివాళ్ళు అంతకంటె అసభ్యతా వాక్యాలని సూటిగా చెప్పినందువల్లనే గదా, నీతి పరులందరకూ చలంమీద మంట. ఆంగ్లసాహిత్యంలోనూ ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలన్ని "డి. హెచ్. లారెన్సు" రాసిన అసభ్యపు వర్ణనలు యీసడిస్తారు. "హక్స్లే" రాస్తే ఆకాశానికి ఎత్తేస్తారు. కావటానికి హక్స్లే లారెన్సు శిష్యుడు.

అసలు సాహిత్యంలో దేనినీ అణచివేయటం కల్ల. సాహిత్యం అనేది ఉన్నంతకాలం ఇది సాహిత్యంలో ఉంటూనే ఉంటుంది. ప్రతి సాహిత్య చరిత్రలోనూ, శతాబ్దాల తరబడి ఋజువవుతూన్న విషయం ఇది.

క థా ని క

# ఆదర్శ ఉపాధ్యాయుడు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

శ్యామలరావు ఫోర్తుఫారమ్ పేపర్లు దిద్దుతున్నాడు. పరీక్షలయ్యాక పేపర్లు దిద్దే రోజులంటే, అయ్యవార్ల వెనకాలకూడా చాలా పెద్దవాళ్ళు తిరిగే రోజులన్న మాట. పరీక్ష అంటే అన్నీ అనుకునేరు — ఏన్యువల్ పరీక్షలు.

ఒక పేపరు తీశాడు. అది సోషల్ స్టడీస్ పేపరు. ఒకటో ప్రశ్న: "భారత దేశానికి ప్రస్తుతం అధ్యక్షు డెవరు?" అని.

దానికి విద్యార్థి నిస్సందేహంగా ఇలాగ సమాధానం వ్రాశాడు. "ప్రకాశంగారు" అని

శ్యామలరావుకి చాలా కోపం వచ్చినా ఆ జవాబులో ఉన్న హ్యూమర్‌కి విరగబడి నవ్వాడు.

ఇంతట్లో పార్వతి కాఫీ తెచ్చింది.

"ఏమిటి నవ్వుతున్నారు?" అంది, కాఫీ కిందనిపెట్టి ప్రక్కన కూర్చుంటూ.

"మన దేశానికి ప్రస్తుతం అధ్యక్షుడెవరు?" అని అడిగాడు శ్యామలరావు కాఫీ తీసుకుంటూ.

పార్వతి నవ్వుతూ, "పరీక్ష చేస్తున్నారాయేం?" అంది.

"నీకు కాకపోతే ఈ పేపర్లుచూడు. ఒక్కటేమిటి? ప్రకాశంపంతులు మొదలు జార్జిచక్రవర్తిదాకా ఉన్నపేర్లు అన్నీ సమాధానాలే" అన్నాడు ఉపాధ్యాయుడు.

"అది, చెప్పేవాళ్లు గొప్పతనం" పార్వతి చిన్న విసురు విసిరింది.

"ఎంత చెప్తే మాత్రం, చదువేవళ్ళకి కావాలి? కావలసింది ప్యాసు. స్కూలుఫైనల్ పేసయ్యాక అయిదు పంక్తులు ఉత్తరం రాయలేకపోయినా వీళ్ళ కక్కరలేదు. ప్యాసైతే చాలు. ఇప్పుడు చూశావా ఎంతమంది మన

ఇంటిచుట్టూ తిరుగుతున్నారో? వీళ్లెవరైనా, సంవత్సరం అంతా వాళ్ల అబ్బాయి యెలాగ చదువుతున్నాడో చూస్తారా? అడిగారా? అసలు విద్యావిధానమే అంత" అని చిన్న లెక్చర్ ఇచ్చాడు శ్యామలరావు.

ఏదో ప్యాసు చేసేయండి. మీకు పుణ్యం ఉంటుంది" అంటూ, పోవడానికి లేచింది.

"అబ్బే. రికమండేషన్లు కుదరవండీ" అని శ్యామలరావు నవ్వుతూ పేపరుదిద్ది, వచ్చిన తొమ్మిది మార్కులూ ఇచ్చాడు.

ఆదర్శం అయ్యవార్లకికూడా ఉంటుంది. అధమం శ్యామలరావుకి చాలా ఖచితంగా పని చెయ్యాలనీ, పేపర్లు చాలా స్ట్రిక్టుగా దిద్దాలనీ, ఇలాటివే ఇంకో కొన్ని ఆదర్శాలున్నాయి. సంవత్సరం అంతా అతను కష్టపడి చెప్పాడు క్లాసుకి. తీరా చూస్తే వాళ్ళపని ఇలాగ ఉంది.

అతనికి పూర్తిగా కోపం వచ్చింది. "రికమెండేషన్లు వినను" అని నిష్కర్షగా చెప్పాడు. లెక్కప్రకారం యెవరి కెన్ని మార్కులు వస్తే అన్నీ వేస్తున్నాడు.

"రష్యా రాజధాని వాషింగ్‌టన్."

"గాంధీని హత్యచేసినవాడు టాండన్."

"కలకత్తా మంగలి పరిశ్రమకు ప్రసిద్ధి."

"మద్యనిషేధము అనగా కల్లును ఎక్కువగా తయారు చేసినచో పన్ను కట్టకుండా ప్రభుత్వం చేయు ఏర్పాటు."

శ్యామలరావుకి ఒళ్లు మండుతోంది సంవత్సరం అంతా తాను కష్టపడి చెప్పిన చదువు వృథా! మద్యనిషేధం గురించి తాను మూడు గంటలు లెక్చరిస్తే ఇదీ ఫలితం!

"నూటికి డెభ్భై అయిదు తప్పులకి అంగీకరించినా వీళ్లని ఎవరు పేసు చేయగలరు?" అని.

పది, పదకొండు - అరు... పన్నెండు - మార్కులు వస్తున్నాయి ఒక్కొక్క పేపరుకి. నలభై మందిలోనూ ఫస్టు మార్కు నలభై రెండు.

* * *

పేపర్లు పట్టుకొని శ్యామలరావు హెడ్మాస్టరింటికి వెళ్ళాడు. ప్రపంచంలో ఒక బాధ ఏమిటంటే, ఆదర్శవాదికీ యథార్థవాదికీ ఒకే విషయంలో అధికారం ఉండడం. హెడ్మాస్టరు రియలిస్టు; అందుచేత పేపర్లు ఏగాదిగా చూసి, "ఆవరేజి ఎంత వచ్చింది?" అన్నాడు.

"పంధొమ్మిది."

కుర్చీలో ఒక్కసారి ఎగిరిపడ్డాడు హెడ్‌మాస్టరు.

"అంత తక్కువ వేశారేం?"

కొంచెం చిరాకుపడ్డాడు శ్యామలరావు ఆ ప్రశ్నకి. "వాళ్ల పేపర్లను బట్టి చూస్తే అంతకంటె..."

"మరి, క్లాసులో ఎంత మంది ఫేలవుతారో చూశారా? సోషల్ స్టడీసులో ఇంత పూర్‌గా ఉన్నారా?"

"వాళ్ల పేపర్లుబట్టి చూస్తే ఈ మార్కులు ఎక్కువే ననిపిస్తుంది. 'గాంధీని హత్య చేసినవాడు టాండన్' అని రాస్తే ఎన్ని మార్కులివ్వాలంటారు?"

హెడ్మాస్టరు కొంచెం ఆగి, "అయితే, ఇంతకన్న లిబరల్‌గా దిద్దలేనంటారన్నమాట"

"అవునండి."

"సరే కాని, ఇది మీకే మచ్చ కాదండీ? సంవత్సరం అంతా మీరే తీసుకున్నారుగా క్లాసుని?"

పార్వతిని మభ్యపెట్టినట్టు హెడ్మాస్టరుని మభ్యపెట్టలేకపోయాడు శ్యామలరావు. ఈ విషయం నిజమే. కాని, విద్యార్థుల తెలివి తక్కువని మార్కులతో కప్పిపుచ్చితే ఎలాగ?

"అయినా ఎంత మందినని ఇలాగ రక్షిస్తాం?" అని శ్యామలరావు సెలవు తీసుకున్నాడు. హెడ్మాస్టరు తనకి కావలసినవాళ్ళకైనా మార్కులు వెయ్యని అబియిడీ మీద కోపగించుకున్నాడు. అనుభవం లేదు అనుకున్నాడు.

* * *

"నమస్కారం శ్యామలరావుగారూ!"

సాయంత్రం అయిపోయింది. రోడ్డు వెంట నడిచివస్తూ ఈ మాటలు విని శ్యామలరావు వెనక్కి తిరిగి చూశాడు.

"నమస్కారం. ఎవరండీ?"

"ఎవరైతే ఏంలెండి? ఎవరి గౌరవం మీరు వుంచారు కనక? నాలుగో ఫారం పేపర్లిచ్చేశారటగా?"

శ్యామలరావుకి కోపం వచ్చింది, ఏమిటీ అప్రస్తుత ప్రశ్న అని.

కొంచెం కోపంగా అతను ఆ వ్యక్తి ముఖం లోకి చూశాడు.

"తమరి కోసమేనండి. కాని, ఊరుందేం, మంచిది కాదండి ఒళ్ళు చూసుకుంటేగాని. ఆ పైని కొత్త. బాగా వేయించుకోవాల!"

ఉపాధ్యాయుడికి చెమట పోసింది. తంతాడా? కానీ కాని ఆదర్శం వదలకూడదు. వృత్తికి ద్రోహం చెయ్య కూడదు

అతనివంతా గొప్ప ఉపన్యాసం ఇద్దామను కున్నాడు. కాని నోరు మెదలలేగు. ఇంతట్లో వ్యక్తి వెళ్ళిపోయాడు. అతనింటికి వచ్చి కూల బడ్డాడు.

అతని స్థితంతా చూసి పార్వతి, "ఏమండీ అలాగ ఉన్నారు?" అంది.

"ఏంలేదులే, ఉత్తరాలేమైనా వచ్చాయా?"

"ఏమీ లేవు. కాని సాయంత్రం ఆవిడెవరో మీకోసం వచ్చింది. వాళ్ళబ్బాయి మీ క్లాసుట. మీ పేపర్లో పోయిందట. కళ్ళనీళ్ళు పెట్టింది, మరొకయేడు చదువుకోవాలని పాపం..."

"సరిలే" అని కసురుకున్నాడు శ్యామల రావు. తెల్లబోయి పార్వతి ఊరుకుంది.

మర్నాడు ఉదయానికి శ్యామలరావుకి అన్న సన్మానమూ జరిగిపోయింది. ఏ గోడమీద చూసినా అతని పేరే విశేషణాలతో సహా.

ఎలాగో ఆ సంవత్సరం గడుస్తూంది. డి. యి. వో ఇన్స్పెక్షన్‌కి వచ్చినప్పుడు, క్లాసులో కొన్ని ప్రశ్నలు వేశాడు. అంత పాడుగా లేదు రెస్పాన్సు. శ్యామలరావు ఫేల్ చేసినా, నిరు డంతా ప్యాసయ్యారు. ఈ యేడంతా కొత్త వాళ్ళే.

"నిరుటి మార్కుల లిస్టు" అన్నాడు ఆఫీసరు. చూసి, "చాలా పూర్‌గా ఉంది ఇలా అయితే ఊర్లోసించి, మీ చేతగానితనం గురించి వస్తూన్న పిటీషన్లు నిజమే అనుకోవాలి" అన్నాడు

బి. యిడి, డి. యి వో వైపు తెల్లబోయి చూశాడు.

* * *

మళ్ళా మే వచ్చింది. మళ్ళా పేపర్లు.

"సింహళమునకు రాజధాని సింగపూరు."

"మన దేశపు ప్రధాన మంత్రి షేక్ అబ్దుల్లా"

పార్వతి నవ్వుతోంది.

కాని ఆ పేపరుకే 56 మార్కులు.

"ఏమిటండీ?" అన్నది.

"విద్యా విధానాన్ని బట్టి నావిధి!"

ఫస్టు మార్కు 82. అంతా 4 కి పైనే.

హెడ్మాస్టరు షేక్‌హాండ్ ఇచ్చి, "గొప్ప ఇంప్రూవ్‌మెంట్" అన్నాడు.

ఊళ్ళో వాళ్ళంతా అతన్ని అభినందించారు.

విద్యార్థు లతనికి శత సహస్ర వందనా లర్పిస్తున్నారు

శ్యామలరావుకి మాత్రం నిరుడు పోయిన గౌరవం పోయినా, విద్యా పద్ధతులు తెలిశాయి. అత నందరికీ ఆదర్శవంతుడయ్యాడు.

మానవునిలోని శక్తులు చక్కగా వికాసం పొందడానికై క్రమంగా సకల ప్రతిబంధకాలను తొలగించుకోడమే స్వేచ్ఛ. ఇట్టి స్వేచ్ఛను మానవుడనుభవించాలంటే అతనికి కేవలం ఆర్థిక పుష్టి, భద్రతా వున్నంత మాత్రాన చాలదు. అతని బుద్ధిని శృంఖలాబద్ధం చెయ్యని స్వేచ్ఛాపూర్వకమైన సాంస్కృతిక వాతావరణంలో అతడు నివసించగలిగి వుండాలి. మానవునికి అధికతర స్వాతంత్ర్యం సంపాదించటానికై డిక్టేటర్‌షిప్పు ఉండవలసిన అవసరాన్ని త్రోసిరాజు చెయ్యాలంటే ప్రజాస్వామ్యం ఒక క్రొత్త సంస్కారాన్ని పొందాలి. పార్లమెంటరీ విధానంపోయి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం సాక్షాత్తుగా ప్రజల ద్వారానే ప్రజా పరిపాలన అవతరించాలి.—యం. యన్. రాయ్.